సాక్షి ఖమ్మం

గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



గండ్లు పూడ్చితేనే సాగునీరు

ఇటీవలి వరదలతో సాగర్ కాల్వకు గండ్లు పడగా, అవి పూడ్చితేనే పంటలకు సాగునీరు అందుతుందని రైతులు అంటున్నారు. 8లో



బాగు చేయిస్తేనే బతుకు

మున్నేరు వరద ప్రభావంతో తడిసి పనికి రాకుండా పోయిన ఎలక్ట్రికల్ వస్తువుల మరమ్మతు బాధితులకు భారంగా మారింది. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గణేశ్ నిమజ్జన ప్రాంతాల్లో సీపీ పరిశీలన



నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సునీల్‌దత్, అభిషేక్ అగస్త్య

ఖమ్మంక్రైం: గణేశ్ విగ్రహాలను వేసే ప్రకాశ్‌నగర్ వద్ద గల మున్నేరు ప్రాంతాన్ని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ అధికారులకు పలు సూచనలు చేశారు. శోభాయాత్ర, నిమజ్జన సమయాల్లో ఎలాంటి ఇబ్బంది రానీయొద్దని, రోడ్లపై వైర్లు, చెట్టకొమ్మలు అడ్డుగా లేకుండా చూడాలని సూచించారు. క్రేన్లు, ఫ్లడ్ లైట్ల ఏర్పాట్లు, బారికేడింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలను కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, పోలీసులతో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు, ఇన్‌స్పెక్టర్ రమేష్, స్థానిక కార్పొరేటర్ గజ్జెల లక్ష్మి వెంకన్న పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ఖమ్మం సహకారనగర్ : నగరంలోని నయాబజార్ పాఠశాల విద్యార్థులకు దాతలు అందించిన నోట్ పుస్తకాలను డీఈఓ సోమశేఖర శర్మ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలతో అనేక మంది విద్యార్థుల పాఠ్య, నోట్ పుస్తకాలు చిరిగిపోయాయని, ఈ క్రమంలో దాతలు అందించిన నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం కూలిన పాఠశాల ప్రహరీని, నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం సుధారాణి, ఉపాధ్యాయులు ఎస్.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠ్య పుస్తకాలు పంపిణీ..

నగరంలోని వరద ముంపు ప్రాంతాల విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో జిల్లాలో వరద ముంపు బాధిత ప్రాంతాల్లో 3వేల మంది విద్యార్థులుండగా.. వీరికి అవసరమైన నోట్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇక గోడౌన్‌లో ఉన్న పాఠ్య పుస్తకాలను గురువారం నుంచి పంపిణీ చేయనుండగా.. ఆరో తరగతి విద్యార్థులు 320 మందికి మాత్రం అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో దాతల సహాయంతో వారికి సైతం పాఠ్య పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ తెలిపారు.

17న ప్రజాపాలన దినోత్సవం

జాతీయ జెండా ఆవిష్కరించనున్న డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం సహకారనగర్ : ఈ నెల 17న ప్రజాపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీల్లో జాతీయ జెండాలు ఎగురవేయాలని అధికారులు నిర్ణయించారు. కాగా, ఖమ్మంలో జరిగే ప్రజాపరిపాలన దినోత్సవంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఇటీవల ఆకేరు, పాలేరు, మున్నేరు వరదల ప్రభావానికి లోనైన లోతట్టు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి బుధవారం కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో సుదీర్ఘంగా భేటీ అయిన ఎంపీ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వైస్ చైర్మన్‌గా ఉన్న ఎంపీ, ఆ పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది వేతన విరాళ చెక్కును కలెక్టర్‌కు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు, ఇతర అభివృద్ధి పనుల నిర్వాహణకు అంచనాలు రూపొందించాలని, ఇండ్లతో పాటు పంటల గణాంకాలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాలసాని లక్ష్మీనారాయణ, కొప్పుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ మేళా..

ముంపు బాధితులకు కొత్తవి అందజేయనున్న సర్కార్

- ఖమ్మం కార్పొరేషన్‌లో పరిధిలో 14 కేంద్రాలు
- ఈనెల 20 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మిగతా మండలాల్లో ఇంటింటికీ వెళ్లి సిబ్బంది సర్వే

సాక్షిప్రతినిధి, ఖమ్మం : వరదలతో కొట్టుకుపోయిన, తడిసి బురదమయమైన సర్టిఫికెట్ల స్థానంలో కొత్తవి జారీ చేసేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచనలతో ముంపు ప్రాంతాల్లో సర్టిఫికెట్లు పోయిన వారిని గుర్తించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 14 కేంద్రాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో 72 బృందాలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నాయి. 20 రకాల సర్టిఫికెట్ల వివరాలు సేకరించి కొత్తగా వాటిని బాధితులకు ఇస్తారు. ఈ ప్రక్రియ వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ప్రారంభమైంది.

విలువైన సర్టిఫికెట్లు కోల్పోయి..

జిల్లాలో గత నెల 31, ఈనెల 1, 2 తేదీల్లో వచ్చిన వరదలతో పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులతో పాటు విలువైన డాక్యుమెంట్లు వరదల పాలయ్యాయి. విద్యార్హత సర్టిఫికెట్లు, భూమి పట్టాలు, వ్యక్తిగతమైన పలు రకాల సర్టిఫికెట్లను కోల్పోయారు. ఇందులో ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు, పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్న బాధితులూ ఉన్నారు. ప్రైవేట్ కంపెనీల్లో త్వరలో ఉద్యోగ ఇంటర్వ్యూకు వెళ్లే వారి సర్టిఫికెట్లు కూడా తడిసి ముద్దయ్యాయి. వరదలు తమ గూడుతో పాటు ఆస్తి నష్టం చేసిందని, కష్టపడి చదవిన సర్టిఫికెట్లు కూడా వదర పాలయ్యాయని బాధితులు ఆవేదన చెందారు. అయితే విద్యార్హత సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి కొత్తగా సర్టిఫికెట్లు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు మిగతా సర్టిఫికెట్లు కూడా ఇస్తారు.

మిగతా ప్రాంతాల్లో ఇంటింటి సర్వే..

జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో సర్టిఫికెట్లు కోల్పోయిన వారి వివరాల సేకరణకు 72 బృందాలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాయి. అన్ని మండలాల్లో మొత్తంగా 5,831 ఇళ్లు ముంపునకు గురయ్యాయి. కొన్ని మండలాల్లో ఒకరోజు, మరికొన్ని మండలాల్లో నాలుగు రోజుల్లో ఈ బృందాలు సర్వే పూర్తి చేస్తాయి. ఒక్కో బృందం 50 ఇళ్లను సర్వే చేస్తుంది. మండలాల వారీగా చూస్తే ఎక్కువగా ఖమ్మంరూరల్‌లో 2,813 ఇళ్లు, మధిరలో 1,105, ఎర్రుపాలెంలో 429, కూసుమంచిలో 417, ముదిగొండలో 222, నేలకొండపల్లిలో 197, తిరుమలాయపాలెంలో 192, బోనకల్‌లో 117, చింతకాని మండలంలో 122 ఇళ్లు ఉన్నాయి. అత్యధికంగా ఖమ్మం రూరల్ మండలంలో 15 బృందాలు, మధిర మండలానికి 10బృందాలను కేటాయించారు. ఈ రెండు మండలాల్లో నాలుగు రోజుల పాటు సర్వే కొనసాగనుంది.



నయాబజార్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో దరఖాస్తులు అందజేస్తున్న బాధితులు

ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 14 డివిజన్లు వరద తాకిడికి గురయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 15,123 ఇళ్లు వరదలో మునిగాయి. ఇందులో ఖమ్మం కార్పొరేషన్‌లోనే అత్యధికంగా 9,292 ఇళ్లు ఉన్నాయి. అయితే ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేసేందుకు చాలా సమయం పడుతుందనే ఉద్దేశంతో ప్రభావిత ప్రాంతాల్లోనే దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వరదలతో సర్టిఫికెట్లు నష్టపోయిన బాధితులు ఈ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులు ఇవ్వాలి. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో నయాబజార్ కళాశాల, రాజేంద్రనగర్ ప్రాథమిక పాఠశాలలో మూడు చొప్పున, రామన్నపేట రైతు వేదిక, గాంధీచౌక్ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే ఐటీ హబ్, ధంసలాపురం మండల పరిషత్ పాఠశాల, గీతాంజలి పాఠశాల, పాత డీఆర్‌డీఓ కార్యాలయంలో ఒక్కో కేంద్రం పెట్టారు. ఈ నెల 20 వరకు ఈ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు.

అంతా ఉచితం..

మండలాల్లో ఇంటింటి సర్వే, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తర్వాత.. ఒక్కొక్కరి వివరాలను సిబ్బంది మీ సేవా ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వివరాల నమోదు నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్ల జారీ వరకు అంతా ఉచితంగానే సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్హత సర్టిఫికెట్లు, జనన, మరణ ధ్రువీకరణ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, వ్యవసాయ పట్టాదారు పాస్ పుస్తకాలు, గ్యాస్ బుక్‌లు.. ఇలా అన్ని రకాల పత్రాలను నెల రోజుల్లోగా ఇవ్వనున్నారు.

సర్టిఫికెట్లు లామినేషన్ చేసి ఇస్తాం..



వరదలో కొట్టుకుపోయిన సర్టిఫికెట్ల స్థానంలో కొత్తవి అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే క్యాంపుల నిర్వహణతో పాటు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి అధికారులు సర్వే చేస్తున్నారు. ఈనెల 20 వరకు క్యాంపులు అందుబాటులో ఉంటాయి. కేంద్రాలకు వచ్చి దరఖాస్తు చేసుకుంటే సర్వే చేసి ఒరిజినల్స్ అందజేస్తాం. సర్టిఫికెట్లు కావాల్సిన వారు ఏదైనా సమస్య ఉంటే 1077కు కాల్ చేయొచ్చు. విదేశాలకు వెళ్లే వారు, కౌన్సెలింగ్‌కు, ఇతర ఉద్యోగాలకు వెళ్లేందుకు అత్యవసరమైన వారికి ప్రొవిజినల్ సర్టిఫికెట్లు ఇస్తాం. 20 రోజుల్లో ఒరిజినల్స్ అందుతాయి. మా బృందాలు ఇళ్లలో సర్వే చేస్తూ ఒక కుటుంబంలో పోయిన సర్టిఫికెట్ల వివరాలను ఒకే ఫార్మాట్‌లో రాసుకుని.. దానికి ఒక నంబర్ కేటాయిస్తారు. దాని ప్రకారం పంపిణీ చేపడతారు. మీసేవలో మేమే దరఖాస్తు చేసి సర్టిఫికెట్లను లామినేషన్ చేసి బాధితులకు ఉచితంగా ఇస్తాం. – ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్

టెన్త్, ఇంటర్ సర్టిఫికెట్లు పోయాయి



మాది మంచికంటినగర్. నావి పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు వరదల్లో కొట్టుకుపోయాయి. మా ఇంట్లో నా సర్టిఫికెట్లు మాత్రమే పోయాయి. ఈ సర్టిఫికెట్లు కావాలని నయాబజార్ కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకున్నా. త్వరలోనే నా సర్టిఫికెట్లు నాకు వస్తాయని చెప్పారు. ఈ స్థాయిలో ఎప్పుడూ వరదలు రాలేదు. ఈ సర్టిఫికెట్లు ఉంటేనే ఉన్నత చదువులకు వెళ్లేది.
– వి.శిరీష, మంచికంటినగర్, ఖమ్మం

ముగ్గురి సర్టిఫికెట్లు కొట్టుకుపోయాయి..



మా కాలనీకి వచ్చిన వరదతో ఇళ్లలో సామాన్లతోపాటు సర్టిఫికెట్లు కూడా కొట్టుకుపోయాయి. అధికారులు సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పడంతో ఇక్కడ దరఖాస్తు చేసుకోవడానికి వచ్చాం. టెన్త్, ఇంటర్ సర్టిఫికెట్లతోపాటు డిగ్రీ షార్ట్ మెమోలు పోయాయి. మేము ముగ్గురు అన్నదమ్ములం. ముగ్గురి సర్టిఫికెట్లు వరదలో కొట్టుకుపోయాయి.
– డి.బాలాజీసింగ్, సుతారి బజార్, నాయుడుపేట

శాంతిస్తున్న గోదారి

- ఉదయం ఏడు గంటలకు 50.30 అడుగులకు చేరిన నీటిమట్టం
- క్రమంగా రాత్రి 10 గంటలకు 47.10 అడుగులకు తగ్గిన వరద
- ఇప్పటికే మూడుసార్లు రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవాహం



భద్రాచలం వద్ద ప్రవహిస్తున్న గోదావరి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించిన గోదావరి బుధవారం తగ్గుముఖం పట్టింది. మంగళవారం రాత్రి 11 గంటలకు నీటిమట్టం 49.60 అడుగులుగా నమోదు కాగా, బుధవారం ఉదయం 7 గంటల వరకు వరద క్రమంగా పెరుగుతూ 50.30 అడుగులకు చేరింది. అప్పటి నుంచి 10 గంటల వరకు నిలకడగా ఉన్న గోదావరిలో, ఉదయం 11 గంటల నుంచి వరద ప్రవాహం తగ్గుతోంది. సాయంత్రం 4 గంటలకు 49 అడుగులకు తగ్గింది. 11,39,375 క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళ్తోంది. రాత్రి 7.47 గంటలకు 48 అడుగుల కంటే దిగువకు రావడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. రాత్రి 10గంటలకు 47.10 అడుగులకు తగ్గిపోయింది.

ఎగువ నుంచి తగ్గిన వరద

గోదావరికి ఎగువ ప్రాంతాల్లో వర్షాలు సైతం తగ్గాయి. శ్రీరామ్ సాగర్, కడెం ప్రాజెక్టుల నుంచి కూడా ప్రవాహం తక్కువగా ఉంది. తుపాకులగూడెంలోని సమ్మక్క సారక్క బ్యారేజీ నుంచి 6 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. చర్లలోని తాలిపేరు, ప్రశాంతంగా ఉండగా, గోదావరికి దిగువన శబరి ఉప నది ప్రస్తుతానికి 4 గంటలకు 54.47 అడుగుల వద్ద నిలకడగా ఉంది. నీటిప్రవాహం చాలా తక్కువగా ఉండటంతో భద్రాచలం వద్ద గోదావరి వరద గురువారం సైతం తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ఐదుసార్లు మొదటి ప్రమాద హెచ్చరిక దాటి..

భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం ఐదు సార్లు మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించగా, మూడు సార్లు రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించింది. కేవలం ఒక్కసారే మూడో ప్రమాదహెచ్చరికను దాటి ప్రవహించింది. తాజాగా గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించినా, వర్షం లేకపోవడంతో ముంపు కాలనీలకు బ్యాక్ వాటర్ సమస్య తలెత్తలేదు. దీంతో అధికారులు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. మరో పక్క కరకట్టను పొడగించడం కారణంగా కూనవరం రోడ్డు ద్వారా పట్టణంలోకి వచ్చే వరద నీటికి కూడా అడ్డుకట్ట వేసినట్లయింది.

అటవీ అమరుల త్యాగాలు మరువలేనివి

డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్

ఖమ్మంవన్‌టౌన్: అటవీ అమర వీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ అన్నారు. బుధవారం అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అటవీ సంపదను కాపాడే క్రమంలో ఎందరో ఉద్యోగులు బలయ్యారని అన్నారు. వారి త్యాగాలను స్మరిస్తూ సెప్టెంబర్ 11న అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అటవీ సంపదను పరిరక్షించడంలో ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుతూ అటవీ సంపదను పరిరక్షించాలని, పర్యావరణ సమతుల్యత కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ వి.మంజుల, కూసుమంచి, మధిర ఎఫ్ఆర్‌ఓలు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్

దెబ్బతిన్న పంటల పరిశీలన

కూసుమంచి : మండంలోని పలు గ్రామాల్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. మునిగేపల్లి, కేశ్వాపురం, నానుతండా, నర్సింహులగూడెం, పాలేరు, ఈశ్వరమాధారం, రాజుపేట తదితర గ్రామాల్లో ఈ బృందం సభ్యులు పర్యటించి దెబ్బతిన్న పత్తి, వరి, మిర్చి పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు , సలహాలు అందించారు. భారీ వర్షాలకు అధిక తేమ వలన పంటలకు నష్టం జరుగుతున్నందున చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. వరంగల్ ప్రాంతీయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, వైరా కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ కె. రవికుమార్, శాస్త్రవేత్తలు వి.చైతన్య, ఫణిశ్రీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మునిగేపల్లిలో దెబ్బతిన్న పత్తిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కట్టుబట్టలే మిగిలాయి..

సర్వం కోల్పోయాం.. ఆదుకోండి

- కేంద్ర బృందానికి వరద బాధితుల వేడుకోలు
- వరద నష్టాన్ని చూసి చలించిన బృందం సభ్యులు
- దెబ్బతిన్న పంటలు, ఇళ్ల పరిశీలన
- నష్టాన్ని బృందానికి వివరించిన కలెక్టర్



భూములు పనికిరాకుండా పోయాయని కేంద్ర బృందానికి వివరిస్తున్న రాకాసితండా రైతులు

తిరుమలాయపాలెం/కూసుమంచి/ఖమ్మంవన్‌టౌన్ : ఒక్కసారిగా వచ్చిన వరదలతో సర్వస్వం కోల్పోయాం.. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగలలేదు.. పంటలు, ఇళ్లతో పాటు ఇంట్లో దాచుకున్న నగదు, నగలు, నిత్యావసరాలన్నీ నీట మునిగాయి.. ఈ తరుణంలో ప్రభుత్వమే తమను ఆదుకోవాలి అంటూ వరద బాధితులు కేంద్ర బృందాన్ని వేడుకున్నారు. వరద ముంపునకు గురైన తిరుమలాయపాలెం మండలం రాకాసితండా, కూసుమంచి మండలం భగవత్‌వీడు, ఖమ్మంరూరల్ మండలం గూడూరుపాడు, తనకంపాడు, కస్నాతండాలో కేంద్ర బృందం బుధవారం పర్యటించింది. రెండు బృందాలుగా విడిపోయిన సభ్యులు మొదట పాలేరు పరీవాహక ప్రాంతంలో జరిగిన నష్టాన్ని పరిశీలించారు. భగవత్‌వీడులో దెబ్బతిన్న పొలాలను, అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను చూశారు. పాలేరు పరీవాహకంలో 25 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సభ్యులకు వివరించారు. రైతులు సైతం తమ గోడును అధికారులకు విన్నవించారు. దెబ్బతిన్న వరి, కోతకు గురైన పొలాలు, ఇసుక మేటల ఫొటోలు చూసి బృందం సభ్యులు చలించిపోయారు. కోక్యాతండాకు చెందిన రైతు హలావత్ నర్సింహారావు పంట నష్టం గురించి తెలపగా ఈ నష్టం పూడ్చలేనిదని, రైతులను అన్ని విధాలా ఆదుకునేలా తాము కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తిరుమలాయపాలెం మండలం రాకాసితండాలో పర్యటించగా.. బాధితులు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆకేరు వరదలు ఒక్కసారిగా గ్రామాన్ని చుట్టుముట్టాయని, కట్టుబట్టలతో కొండలు, గుట్టలు ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నామని చెప్పారు. వేల రూపాయల పెట్టుబడితో పండించిన పంటలు పూర్తిగా నీటి పాలయ్యాయని, ఇసుక మేటలు వేయడంతో తిరిగి సాగుచేసే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఇల్లు పూర్తిగా మునిగిపోయిందని, వచ్చి చూడాలని ఓ మహిళ కోరగా బృందం సభ్యుడు ఆ ఇంటికి వెళ్లి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యం, బియ్యం, కూలిన ఇళ్లను చూసి సభ్యులు చలించిపోయారు. ఆ తర్వాత ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించిన సభ్యులు తనగంపాడులో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. పొలాల్లో వేసిన ఇసుక మేటల తొలగింపునకు ఎంత ఖర్చవుతుందని కలెక్టర్‌తో పాటు రైతులను అడిగి తెలుసుకున్నారు. కస్నాతండాలో ముంపు ప్రాంతాలను సందర్శించి నష్టం గురించి గ్రామస్తులను అడిగారు.

జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సలహాదారు కల్నల్ కేపీ సింగ్ నేతృత్వం వహించిన ఈ బృందంలో మహేష్‌కుమార్, శాంతినాథ్, శివప్ప, ఎస్‌కే కుష్వాహ, టీ నియాల్ కన్సన్, డాక్టర్ శ్రీ శవివర్ధన్ సభ్యులుగా ఉన్నారు. వారి వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్, రాష్ట్ర గనులు, భూగర్భ ఖనిజాల శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలక్టర్ మధుసూదన్ నాయక్, జలవనరుల శాఖ ఎస్‌ఈ నర్సింహారావు, జెన్‌కో ఎస్‌ఈ దేశ్యా, కూసుమంచి ఏడీఏ సరిత, ట్రాన్స్‌కో ఏడీఏ కోక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్‌లో 'సాక్షి'కి ప్రత్యేక స్థానం

ఆకేరు వరదలతో సర్వం కోల్పోయిన రాకాసితండా వాసుల కష్టాలపై 'సాక్షి' జిల్లా, ప్రధాన సంచికల్లో వచ్చిన కథనాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇళ్లతో పాటు పచ్చని పంటలు తమ కళ్ల ముందే కోల్పోవడంతో పాటు భూముల్లో ఇసుక మేటలు వేసిన పరిస్థితులను సాక్షి ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రుల దృష్టికి తెచ్చి కదిలించిందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తమకు జరిగిన నష్టాన్ని సాక్షి ద్వారా తెలుసుకున్న పలు జిల్లాల వారు సహాయం అందిస్తున్నారంటూ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కూసుమంచి మండలంలో జలవనరులశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ తిలకించగా బృందం సభ్యులకు సీఈ విద్యాసాగర్ జరిగిన నష్టం గురించి వివరించారు.



రాకాసితండాలో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం



కూసుమంచి మండలంలో పంటల పరిశీలనకు వెళ్తున్న కేంద్ర బృందం సభ్యులు, కలెక్టర్

నేడు మున్నేరు ముంపులో పర్యటన..

కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో పర్యటించిన కేంద్ర బృందం గురువారం ఖమ్మంరూరల్ మండలం, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో పర్యటించనుంది. ఇందుకు సంబంధించి అధికారులు ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో పర్యటన అనంతరం కేంద్ర బృందం సూర్యాపేట జిల్లాలోని అనంతగిరి, కోదాడ మండలాల్లో పర్యటించనుంది.

రహదారులు, బ్రిడ్జీలను పరిశీలించిన మరో బృందం



ఆకేరు బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న బృందం సభ్యులు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

తిరుమలాయపాలెం మండలం బీరోలు పరిధిలోని బంధంపల్లిలో చెరువు గండితో కొట్టుకుపోయిన చప్టా, రహదారిని మరో కేంద్ర బృందం పరిశీలించింది. అలాగే హైదర్‌సాయిపేట రావిచెట్టుతండా పరిధిలోని ఆకేరుపై నిర్మించిన బ్రిడ్జి పూర్తిగా కొట్టుకుపోగా ఆ ప్రాంతంతో పాటు, రాకాసితండాలో కొట్టుకుపోయిన రహదారిని పరిశీలించిన సభ్యులు నష్టాన్ని అంచనా వేశారు. కూసుమంచి మండలం పాలేరు వద్ద సాగర్ ఎడమ కాలువకు పడిన గండి ప్రాంతాన్ని, కోతకు గురైన కాలువను కూడా పరిశీలించారు. మల్లాయిగూడెం వద్ద దెబ్బతిన్న పీఆర్ రోడ్డు, కల్వర్టును చూశారు. పాలేరుకు ఎప్పుడూ ఇంత వరద రాలేదని, రిజర్వాయర్ సామర్థ్యానికి మించి పది రెట్ల వరద రావడంతో కాలువలు కోతకు గురయ్యాయని అధికారులు వివరించారు.

క్లుప్తంగా

రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు


తేమ శాతం పరిశీలిస్తున్న ఎం.అలీం

వైరా: పెసర కొనుగోలు కేంద్రంలో రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా మార్కెటింగ్ అధికారి అలీం ఆదేశించారు. వైరాలోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ ఏర్పాటు చేసిన పెసర కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. పెసర రైతులకు గన్నీ బ్యాగుల కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎండబెట్టి, శుభ్రపర్చిన పెసరను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి గిట్టుబాటు ధర పొందాలని చెప్పారు. మోసిన్ సుల్తాన, వి.వెంకటేశ్వర్లు, బి.విజయకుమారి, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

ఖమ్మంమయూరిసెంటర్‌టౌన్: జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీల్లో సాధారణ పరిపాలనను బలోపేతం చేసేందుకు ఈ బదిలీలు చేపట్టారు. బదిలీ అయిన 387 మంది పంచాయతీ కార్యదర్శులు ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ అయి బదిలీ స్థానాలలో వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశించారు. లేదంటే తీవ్రంగా పరిగణించాల్సి వస్తుందని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫెర్టిలైజర్స్ దుకాణంలో చోరీ

కొణిజర్ల: గుర్తు తెలియని వ్యక్తి ఫెర్టిలైజర్స్ దుకాణంలో చోరీ చేసిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ సూరజ్ కథనం ప్రకారం.. కొణిజర్ల – ప్రొద్దుటూరు రోడ్డులో జైకిసాన్ ఫెర్టిలైజర్స్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి చొరబడి గల్లా పెట్టెలో ఉన్న రూ.60 వేల నగదు, ఓ ట్యాబ్ ఎత్తుకెళ్లాడు. దుకాణం వెనక ఉన్న తలుపులు పగలగొట్టి దుకాణంలోకి జొరబడినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ సూరజ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. యజమాని కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్‌ఐ కూచిపూడి జగదీశ్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లతో పాటు రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఐదుగురి అరెస్ట్

కారేపల్లి: పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి, ఐదుగురిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. ఈ ఘటన బుధవారం కారేపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని గాదెపాడు గ్రామం శివారు శ్మశాన వాటిక వద్ద పేకాట ఆడుతున్నారని సమాచారం రావటంతో అక్కడికి చేరుకున్న పోలీసులు కేసగాని అనిల్, కేసగాని అశోక్, కేదాశ వెంకన్న, నూనావత్ బిక్కులాల్, రవిని అదుపులోకి తీసుకున్నారు. రెండు ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్ల తోపాటు, ఘటనా స్థలంలో రూ.1,650 నగదును స్వాధీనం చేసుకున్నారు.

నలుగురుపై కేసు

నేలకొండపల్లి: మండలంలోని చెరువు మాధారం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులపై పోలీసులకు కేసు నమోదు చేశారు. మండలంలోని చెరువుమాధారంలో పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు బుధవారం దాడి చేశారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్‌లు, రూ.7,290 నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలో ఈర్లపుడి ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో జేసీబీతో చదును చేస్తుండగా బీట్ అధికారి రవి అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో సదరు వ్యక్తి దాడి చేసి పారిపోయారని రవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జేసీబీని తీసుకొచ్చి చదును చేసేందుకు యత్నించిన అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ వెల్లడించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,300	5,600
పెసలు(మార్క్‌ఫెడ్)	8,682	8,682
మిర్చి	17,000	8.000
ఏసీ మిర్చి	20,000	10,700
ఏసీ తాలు	9,000	7,000
పత్తి	7,900	7,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,392

బాగు చేయిస్తేనే బతుకు


సీలింగ్ ఫ్యాన్లు మరమ్మతు చేస్తున్న మెకానిక్‌లు

- వరదతో తడిసిన ఫ్యాన్లు, మోటార్లు, గృహోపకరణాలు
- మెకానిక్ షాపులకు వరద బాధితుల బారులు
- మరమ్మతులకు రూ.వేలల్లో ఖర్చు

ఖమ్మంమయూరిసెంటర్: వరద ప్రభావంతో మున్నేరు ప్రాంతంలో ఇళ్లను మరమ్మతు చేయించుకోవడం బాధితులకు తలకు మించిన భారమవుతోంది. ముంచెత్తిన వరదతో మున్నేరు పరీవాహక ప్రాంతాల్లోని ఇళ్లలోని ఎలక్ట్రానిక్ పరికరాలన్నీ తడిసిపోయాయి. బురద, నీటితో తడిసిన వస్తువులు ప్రస్తుతం పనిచేసే పరిస్థితి లేదు. ఫ్యాన్లు, కూలర్లు, ఫ్రిజ్‌లు, మోటార్లు, టీవీలు, ఏసీలు, ద్విచక్ర వాహనాలు ఇలా ప్రతీది నీటిలో తడిసిపోవడంతో మరమ్మతు చేయించే పనిలో నిమగ్నమయ్యారు. విద్యుత్ శాఖ సిబ్బంది కొత్త మీటర్లు అమర్చడంతో ఇళ్లలోని విద్యుత్ పరికరాలను బాగు చేయించేందుకు మెకానిక్ షాపులకు క్యూ కడుతున్నారు.

బయటకు తీసుకువెళ్లలేక..

అకస్మాత్తుగా వచ్చిన మున్నేరు వరదతో ముంపు ప్రాంతాల ప్రజలు కట్టుబట్టలతో బయటకు వచ్చారు. సామగ్రిని బయటకు తీసుకొచ్చే పరిస్థితి లేక చాలా మంది ఎక్కడివక్కడే వదిలేయగా మరికొందరు ఇళ్లలో అటకలు, సన్‌సైడ్‌ల పైన పెట్టారు. కానీ ఊహించని స్థాయిలో వరద రావడంతో ఇళ్లు మునిగి ఫ్యాన్లు, విద్యుత్ మోటార్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, ద్విచక్ర వాహనాలు, మిక్సీలు, గ్రైండర్లు, వాషింగ్ మిషన్లు సర్వం బురదతో పాడయ్యాయి. వీటి మరమ్మతుకు రూ.వేలకు వేలు ఖర్చవుతుందనే బాధ వేధిస్తున్నా ఇప్పుడు కొత్తవి కొనలేక షాపుల బాట పడుతున్నారు. దీంతో ఖమ్మం కాల్వొడ్డులోని మెకానిక్ షాపులు వరద బాధితులతో కిటకిటలాడుతున్నాయి.

రూ.వందల నుండి రూ.వేలల్లో ఖర్చు

వరద, బరదతో తడిచిన పరికరాల మరమ్మతు చేయించడం బాధితులకు తలకుమించిన భారంగా మారింది. ఇప్పటికే సర్వం కోల్పోయి చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బంది పడుతున్నప్పటికీ ఫ్యాన్లు, విద్యుత్ మోటార్లు తప్పనిసరి కావడంతో అప్పు చేసి మరీ మరమ్మతు చేయిస్తున్నామని వాపోతున్నారు. ఫ్యాన్ మరమ్మతుకు రూ.200 నుండి రూ.500వరకు, విద్యుత్ మోటార్‌కు రూ.500 నుండి రూ.1000 వరకు, కూలర్లకు రూ.500 వరకు, మిక్సీలు, రైస్ కుక్కర్లకు రూ.100 నుండి రూ.500 వరకు ఖర్చవుతోంది. అన్నీ కలిపితే ఒక్కో కుటుంబం రూ.20వేలకు పైగానే వెచ్చించాల్సి వస్తోందని సమాచారం. ఇక ఫ్రిజ్‌లు, ఏసీలను ప్రస్తుతానికైతే పక్కన పెడుతున్నారు.

ఫ్యాన్‌లు, మోటార్లు తీసుకొస్తున్నారు



వరద నీటిలో తడిసి పాడయ్యాయని రోజుకు పదుల సంఖ్యలో జనం ఫ్యాన్లు, మోటార్లను తీసుకొచ్చి ఇస్తున్నారు. వీటి వైరింగ్ పాడవడంతో బాగు చేస్తున్నాం. ఫ్యాన్‌కు రూ.200 వరకు, మోటార్లకు రూ.500 నుండి రూ.2 వేల వరకు చార్జ్ అవుతోంది.

– లక్ష్మణాచారి, మెకానిక్, కాల్వొడ్డు

మోటార్లు చేయించా..



వరదతో రెండు మోటార్లు, ఫ్రిజ్ తడిశాయి. మోటార్లు కొన్నప్పుడు రూ.8 వేలు కావడంతో బాగు చేయించాలని వచ్చా. రూ.1,500 నుండి రూ.2 వేలు అవుతుందని చెప్పినా తప్పనిసరి కావడంతో మరమ్మతు చేయిస్తున్నా. ఫ్రిజ్ మాత్రం ఇప్పుడు పక్కన పెట్టాం.

– బండి రాజేశ్వరరావు, మోతీనగర్

గండ్లు పూడ్చితేనే సాగునీరు


హట్యాతండా వద్ద ఔట్ ఫాల్ కాల్వకు పడిన భారీ గండి

- సాగర్ కాల్వకు పలుచోట్ల గండ్లు
- రూ.18 కోట్లతో ప్రతిపాదనలు

కూసుమంచి: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు సాగర్ కాల్వలకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. వీటిని పూడ్చితేనే ఆయకట్టుకు నీరు వదిలేది. ఇప్పటి వరకు వరదలకు, వర్షాలకు పంటలకు నీటి తడులు అవసరం లేకుండా పోయింది. కానీ, ప్రస్తుతం వర్షాలు తెరిపి ఇవ్వటం, ఎండలు ముండుతుండటంతో సాగులో ఉన్న వరికి మరో పది రోజులపాటు నీటి తడులు కావాల్సి ఉంది. కాల్వలకు పడిన గండ్లు పూడ్చితేనే పాలేరు రిజర్వాయర్ నుంచి జిల్లాలోని 2.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేసే అవకాశం ఉంది.

ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో కాల్వలకు గండ్లు

సాగర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేసే ఇన్‌ఫ్లో కాలువకు ఖమ్మం – సూర్యాపేట జిల్లాల సరిహద్దు అయిన రంగుల బ్రిడ్జి వద్ద భారీ గండి పడింది. ఇక పాలేరు నుంచి జిల్లాలోని ఆయకట్టుకు సాగు నీరు సరఫరా చేసే అవుట్‌ఫాల్ కాల్వకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. ఈ కాల్వకు హట్యాతండా సమీపంలో 150 మీటర్ల మేర భారీ గండి పండింది. దాని సమీపంలోనే అవతలి కట్టకు మరో చిన్నపాటి గండి పడింది. దీంతో తొలుత సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఔట్ ఫాల్ కాల్వకు పడిన భారీ గండిని పూడ్చేందుకు అధికారులు పనులు ప్రారంభించారు. ఇక ఇదే కాల్వ మత్స్య పరిశోధనా కేంద్రం సమీపంలో భారీగా కోతకు గురైంది. ఇక్కడ కట్టను పటిష్ట పరిచి లైనింగ్ చేయాల్సి ఉంది. మినీ హైడల్ ప్రాజెక్టు కాల్వ నుంచి ఔట్ ఫాల్ కాలువకు భారీగా వరద ప్రవహించి కాలువ తీవ్రంగా దెబ్బతినగా ఈపనులు పూర్తయితేనే నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఇక పాలేరు పాత కాల్వకు కూడా వరదతో పలుచోట్ల గండ్లు పడగా పూడ్చాల్సి ఉంది. ఈ పనులన్నీ పూర్తి చేసేందుకు జలవనరుల శాఖ అధికారులు రూ.18 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించగా షార్ట్ టెండర్ పద్ధతిలో పనులను చేపట్టనున్నారు.

పది రోజుల్లో పూర్తి చేస్తాం..

సాగర్ కాల్వలకు పడిన గండ్ల పూడ్చివేత పనులను యుద్ధ ప్రాతిపదికన పది రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కాల్వలకు భారీగా గండ్లు పడటం ఇదే తొలిసారి. గండ్లను పూడ్చి కాల్వ కట్టలను పటిష్టంగా తయారు చేస్తాం. ఏమైనా అవాంతరాలు ఎదురైనా ఆయకట్టు రైతులకు ఇబ్బంది రానివ్వకుండా, పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. – విద్యాసాగర్, సీఈ

వరకట్న వేధింపుల కేసులో ఒకరికి జైలు

కొత్తగూడెంటౌన్: అదనపు కట్నం తేవాలని భార్యను వేధించిన కేసులో కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పెద్దతండాకు చెందిన భూక్య బాలుకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం కొత్తగూడెం మూడో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్ తీర్పు చెప్పారు. లక్ష్మీదేవిపల్లి రేగళ్ల పెద్దతండాకు చెందిన విజయను అదే గ్రామానికి చెందిన భూక్య బాలుకు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.2 లక్షల కట్నంతో పాటు ద్విచక్రవాహనం, సామగ్రి ఇచ్చారు. తర్వాత బాలు వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని.. 2012, అక్టోబర్ 10న తన భార్యను రూ.లక్ష అదనపు కట్నం తేవాలని ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. దీంతో బాధితురాలు అప్పటి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. భూక్య బాలుపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎస్.లావాణ్య వాదించగా.. లైజన్ ఆఫీసర్ ఘని, పీసీ పరసా రామకృష్ణ సహకరించారు.

నేడు జాంబియాకు మిమిక్రీ రమేష్

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 12,13 తేదీల్లో జాంబియాలోని లుసాకాలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కొత్తగూడేనికి చెందిన మిమిక్రీ కళా కారుడు రమేష్ గురువారం వెళ్లనున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. తనతోపాటు నల్లగొండ గద్దర్ నరసన్న, రేలారే గంగ కూడా హాజరవుతారని తెలిపారు.

ఆఖరి మజిలీలోనూ వీడని బంధం

గంటల వ్యవధిలో వృద్ధ దంపతుల మృతి


సుందరమ్మ(ఫైల్)


హనుమయ్య(ఫైల్)

బోనకల్: ఏడు దశాబ్దాల అన్యోన్య దాంపత్య జీవితంలో ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొని సంసార సాగరాన్ని దాటిన ఆ దంపతులు చివరి మజిలీలోనూ ఒకరికొకరు తోడుగా వెళ్లారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రానికి చెందిన నందమూరి హనుమయ్య(90), భార్య సుందరమ్మ(84) దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ కుటుంబం కావడంతో భార్యాభర్తలిద్దరూ కలిసే పొలం పనులకు వెళ్లేవారు. కొన్ని రోజులుగా ఇద్దరూ అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో సుందరమ్మ ఆరోగ్య పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందగా.. నాలుగు గంటల వ్యవధిలోనే హనుమయ్య కూడా తుదిశ్వాస విడిచాడు. దంతులిద్దరూ ఒకే రోజు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. వారి అంతిమ యాత్ర గురువారం నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కస్తూర్బాలో అదనపు కలెక్టర్ తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్


రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల (కేజీబీవీ) పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ బుధవారం సందర్శించారు. గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థుల వివరాలను పాఠశాల ఎస్‌ఓ లతను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో మరుగుదొడ్లు, విద్యార్థినుల వసతి, తరగతి గదులను, వంట గదిని, స్టోర్‌ను తనిఖీ చేశారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంఈఓ రాములు, రాజశేఖర్ పాల్గొన్నారు.

భద్రాద్రిలో ప్రారంభమైన నిమజ్జనాలు


విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరిలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. గణనాథునికి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసి భక్తులు మేళతాళాలు, డప్పుచప్పులతో బాణాసంచా కాల్చుతూ.. ఊరేగింపుగా గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాటుకు తరలించి అక్కడ నిమజ్జనం చేశారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు భక్తులను తీరం వరకు అనుమతించకుండా స్నానఘట్టాల వద్ద స్నానాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లాంచీలు, బోట్లలో గోదావరి మధ్యలో గణనాథులను వదులుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిమజ్జన ఘాట్ వద్ద విద్యుత్ సౌకర్యంతో పాటు నిత్యం పోలీసుల నిఘా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలకు శరీరదానం


సత్తెనపల్లి వీరభద్రాచారి(ఫైల్)

సత్తుపల్లి: తండ్రి పార్థివదేహాన్ని కుమార్తెలు స్వచ్ఛందంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించిన ఘటన బుధవారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. పట్టణంలోని జలగంనగర్‌కు చెందిన సత్తెనపల్లి వీరభద్రాచారి (80) చికిత్స పొందుతూ ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సత్తుపల్లిలోని నివాసంలో బంధువులందరూ కడసారి చూసిన అనంతరం బుధవారం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించారు. మృతుడికి భార్య శేషుకుమారి, కుమార్తెలు ఆర్.అరుణకుమారి, ఎస్.సుశీల, ఎ.సుగుణ ఉన్నారు. వీరు స్వచ్ఛందంగా తండ్రి భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల ప్రయోజనం కోసం అందించారు. కుటుంబ సభ్యులు, సత్తుపల్లి లయన్స్‌క్లబ్, మెడికల్ కళాశాల ఎనాటమీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ దాసరి చంద్రప్రియ, డాక్టర్ అశోక్, నేత్రనిధి బృందం చిలుకుపాటి హనుమంతురావు, పగడాల నాగేశ్వరరావు, హరిప్రసాద్, ప్రవీణ్ అభినందించారు.

సూర్యతండాలో వ్యక్తిపై కత్తితో దాడి

రఘునాథపాలెం: మండలంలోని సూర్యతండాలో ఇరువర్గాలు ఘర్షణపడి కత్తితో దాడి చేసేసుకునేస్థాయికి వెళ్లింది. సీఐ ఉస్మాన్‌షరీఫ్ కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రోగి బిల్లుల చెల్లింపు విషయంలో జాటోత్ మహేశ్, సమీప బంధువు ఠాగూర్ కుటుంబ సభ్యులు ఘర్షణ పడ్డారు. ఈ విషయంలో మహేశ్ ఠాగూర్ తండ్రి మధన్‌పై రాయితో దాడి చేయడంతో తలకు గాయం అయింది. దీంతో ఠాగూర్ మహేశ్‌పై దాడి చేసి కత్తితో పొడిచాడు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్వచ్ఛంద సంస్థలు తెచ్చిన సరుకులు తీసుకెళ్తున్న ముంపు ప్రాంత బాధితులు



స్వచ్ఛంద సంస్థల ఔదార్యం


భోజనం తెచ్చిన ఆటో వద్ద బాధితులు

మున్నేరు, ఆకేరు వరదలతో ఖమ్మంరూరల్, ఖమ్మం నగరంలోని పలు కాలనీలు నీట మునిగాయి. దీంతో చాలా మంది నిరాశ్రయులయ్యారు. వీరిని ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. వరద పోటెత్తినప్పటి నుంచి ప్రతిరోజు ఆయా సంస్థల ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు, కిట్ల పంపిణీ చేపట్టాయి. ఈ క్రమంలో బుధవారం కూడా కొన్ని స్వచ్ఛంద సంస్థలు బాధితులకు నిత్యావసర సరుకులతోపాటు ఆహారాన్ని అందించాయి.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్

తడిసిన బట్టలు.. పుస్తకాలు


వసతిగృహంపై పుస్తకాలు, దుస్తులను ఆరబెట్టుకుంటున్న విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదలు ఇళ్లతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలను ముంచెత్తాయి. ఈ నెల 1న వచ్చిన వరదలతో నయాబజార్ పాఠశాల ఆవరణలో ఉన్న బీసీ సంక్షేమ శాఖ వసతిగృహం వరద ముంపునకు గురైంది. వసతిగృహ భవనం సన్‌సైడ్ వరకు మునిగిపోవడంతో ఆఫీస్ రికార్డ్స్‌తో పాటు విద్యార్థుల బట్టలు, పుస్తకాలు, బెడ్‌షీట్లు, బ్లాంకెట్లు ఇతర వస్తువులన్నీ వరదనీటిలో మునగడంతో పాటు బురదమయంగా మారాయి. ఒక్కసారిగా వచ్చిన వరదతో విద్యార్థులు తమ వస్తువులు, పుస్తకాలు అన్నీ వదిలి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఒడ్డుకు చేరుకున్నారు. వరద తగ్గడం, పాఠశాలలు పునరుద్ధరించడంతో విద్యార్థులు తిరిగి వసతిగృహానికి చేరుకుంటున్నారు. తమ వస్తువులు, పుస్తకాలను చూసి దీనంగా కూర్చున్నారు. తడిసిన పుస్తకాలు, దుస్తులు, బెడ్‌షీట్లను వసతిగృహం పైన ఆరబెట్టుకుంటున్నారు. అంతా బురదతో నిండిపోవడంతో పుస్తకాలను పడవేయలేక, ఉంచుకోలేక ఆవేదన చెందుతున్నారు.

కేఎంసీలో 7,575 కుటుంబాలకు సాయం

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదలతో ఇళ్లు మునిగి నష్టపోయిన బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.16,500 ఆర్థిక సాయం అందింది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9,258 కుటుంబాలు వరదతో నష్టపోయినట్లు అధికారులు సర్వేలో గుర్తించారు. వీరిలో 7,575 కుటుంబాలకు బుధవారం వరకు ప్రభుత్వ సాయం బాధితుల బ్యాంక్ ఖాతాలో జమ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక 1,683 కుటుంబాలకు సంబంధించి బ్యాంక్ ఖాతాల వివరాలు సరిగ్గా లేకపోవడంతో సాయం ఇంకా పడలేదని తెలుస్తోంది. వారి వివరాలను సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

కేఎంసీలో ప్రత్యేక శిబిరం..

సర్వే సమయంలో ఇళ్ల వద్ద లేని బాధితుల కోసం కేఎంసీలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సర్వే సమయంలో అధికారులకు వివరాలు అందించలేని వారు కేఎంసీలో ఏర్పాటు చేసిన శిబిరంలో ముంపునకు గురైన తమ ఇంటి అడ్రస్‌తో పాటు వివరాలను బాధితులు అందించాల్సి ఉంటుంది. కేఎంసీలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి బ్యాంక్ ఖాతాలను తెరిపిస్తున్నారు.

కౌశిక్‌రెడ్డికి మహిళలంటే అంత చులకనా..?

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి


మాట్లాడుతున్న రాగమయి

సత్తుపల్లి: మహిళల ఆత్మగౌరాన్ని.. మనోభావాలను దెబ్బతీసేలా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతున్నారని.. చీరలు, గాజులు వేసుకొనే మహిళలంటే అంత చులకనా అని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మండిపడ్డారు. సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం రాత్రి ఆమె విలేకరులతో మాట్లాడారు. 'పార్టీ ఫిరాయింపుల గురించి వీళ్లా మాట్లాడేది.. గత పదేళ్లల్లో వారే ఫిరాయింపులను ప్రోత్సహించి ఎమ్మెల్యేలను చేర్చుకున్నారు.. పార్టీలను వీలీనం చేసుకున్నారు.. ఆ కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుకు ఏం గిఫ్టులు పంపిస్తారు' అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి తల్లి, భార్యా, బిడ్డ చీరలు, గాజులు ధరించటం లేదా? అసెంబ్లీ ఎన్నికల్లో భార్యా బిడ్డలను అడ్డం పెట్టుకొని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి గెలిపించకపోతే కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుంటామని భార్య, బిడ్డలను కన్నీళ్లు పెట్టించి మహిళా సానుభూతి ఓట్లతో గెలిచిన చరిత్ర కౌశిక్‌రెడ్డిది అని విమర్శించారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ తోట సుజలరాణి ఉన్నారు.

నామ నాగేశ్వరరావుకు దక్షిణ మధ్య రైల్వే అభినందనలు

ఖమ్మంమయూరిసెంటర్: 17వ లోక్‌సభలో జడ్‌ఆర్ యూసీసీ సభ్యుడిగా పనిచేసిన నామ నాగేశ్వరరావును దక్షిణ మధ్య రైల్వే అభినందించింది. నాడు ఎంపీగా, జడ్‌ఆర్ యూసీసీ సభ్యుడిగా రైల్వే సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషిపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయం, సికింద్రాబాద్ నుంచి సంబంధిత శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్, జడ్‌ఆర్ యూసీసీ ఎక్స్–అఫీషియో సెక్రటరీ నుంచి లేఖను నామ కార్యాలయానికి పంపించింది. జడ్‌ఆర్ యూసీసీ పదవీ కాలం ఈ నెల 30తో ముగుస్తుందని, ఇప్పటి వరకు నామ సభ్యుడిగా అందించిన సేవలు, సమస్యల పరిష్కారం కోసం చూపిన చొరవ అభినందనీయమని తెలిపారు.